

కూనంనేనికి వినతి పత్రం అందజేస్తున్న వేదిక ప్రతినిధులు

పాఠశాల భవనాల నిర్మాణం పూర్తయ్యేలా చూడండి

సరూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బడంగ్‌పేట్‌లోని జడ్పీ హైస్కూల్ భవనాల నిర్మాణం పనులు తొందరగా పూర్తయ్యేలా చూడాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కోరారు. ఈ మేరకు శుక్రవారం వేదిక ప్రతినిధులు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయా స్కూళ్ల భవనాల నిర్మాణం పనులను చేపట్టిన మేఘా కంపెనీ మధ్యలోనే పనులు ఆపేయడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయని వారు ఆయనకు వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భవనాల నిర్మాణం తొందరగా పూర్తయ్యేలా చూడాలని వారు కూనంనేనిని కోరారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు మారబోయిన నరేందర్, కొల్లూర్ భీమేశ్, ఎంవీ ఫౌండేషన్ సభ్యుడు కె.ముకుందం, సీపీఐ నాయకులు వెంకటరమణారెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



అమీన్ పటేల్‌కు దరఖాస్తు అందజేస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ శ్రీనివాస్

నూతన జిల్లా కమిటీలతో కాంగ్రెస్‌కు మరింత బలం

ఏఐసీసీ పరిశీలకుడు అమీన్‌పటేల్

సైదాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నూతన జిల్లా కమిటీలతో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరుతుందని ఏఐసీసీ హైదరాబాద్ జిల్లా పరిశీలకుడు, మహారాష్ట్ర ఎమ్మెల్యే అమీన్ పటేల్ అన్నారు. హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియలలో భాగంగా ఐఎస్‌సదన్ గాదాజన్ లక్ష్మీనగర్ వేంకటేశ్వర భక్త సమాజంలో సమావేశం నిర్వహించారు. పార్టీ హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షునిగా ఎన్నిక కోసం కార్యకర్తల మనోభావాలు తెలుసుకోడానికే క్షేత్రస్థాయి అభిప్రాయ సేకరణ చేపట్టినట్లు అమీన్ పటేల్ తెలిపారు. పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతోపాటు, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో, స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష నియామకం కోసం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ దరఖాస్తు అందజేశారు.



సమ్మయ్యకు ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మణెమ్మ కుటుంబ సభ్యులకు పత్రాన్ని అందిస్తున్న శివచరణ్‌రెడ్డి

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

మన్సూరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఎరుకల నాంచారమ్మ బస్తీకి చెందిన సమ్మయ్య అనారోగ్యంతో ఇటీవల చికిత్స చేయించుకున్నారు. ఇందుకు సంబంధించి మంజూరైన రూ.1.55లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాన్ని శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు.

సాయినాథ్‌కాలనీలో...

అర్హులందరూ సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సాయినాథ్‌కాలనీకి చెందిన దేవ మణెమ్మ ఇటీవల మోకాళ్ల సమస్యతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో మణెమ్మకు రూ.1.50లక్షల మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని శుక్రవారం తన నివాసంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు జక్కిడి శివచరణ్‌రెడ్డి అందజేశారు.



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి నామినేషన్‌కి వెళ్తున్న టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో ముందంజ : జితేందర్

చంపాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిందని టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి నామినేషన్ వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తు ముందుకు సాగుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరు, కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ, రైతుభరోసా, పదిలక్షల వరకు ఉచిత వైద్యసేవలు, పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని జితేందర్ అన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ నేతలు వాజిద్, సురేందర్, సురేష్, జ్యోతి, శకుంతల, సేవాదళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్ శ్మశాన వాటిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

శ్మశానవాటిక పనుల పరిశీలన

హయత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి శుక్రవారం హయత్‌నగర్ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరలో పనులు పూర్తిచేయాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చక్కటి వాతావరణం కల్పించేందుకు అన్ని హంగులతో శ్మశాన వాటికను అభివృద్ధి పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఏఈ హేమా నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గొప్పవారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

విద్యార్థులతో ఎంపీ డా.లక్ష్మణ్



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, చైర్మన్ శ్రీనివాస్‌రావు, తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గొప్పవారి జీవితాలను ఆదర్శంగా తీసుకుంటే విజయం మీ సొంతమవుతుందని ఎంపీ (రాజ్యసభ) డా.లక్ష్మణ్ విద్యార్థులకు సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం "పరిచయ్-2025" పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అకాడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామాక్షిప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజల్వన చేశారు. అనంతరం ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామీణ వాతావరణం, అట్టడుగు స్థాయిల నుంచి వచ్చిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాలు ఆదర్శప్రాయమన్నారు. 2014కు ముందు కేవలం 3 నుంచి 400 స్టార్టప్‌లు ఉంటే మోదీ ప్రధాని అయిన తర్వాత లక్ష స్టార్టప్ కంపెనీలు వచ్చాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వెల్లడించారు. స్వదేశీ వస్తువులకు అధికా ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు.

డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఏఎస్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమయం వృథా చేయకుండా కళాశాలకు రెగ్యులర్‌గా హాజరుకావాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథులు కృష్ణకిశోర్, ప్రవీణ్‌కుమార్, కవితాసిస్టర్, కళాశాల ప్రధాన కార్యదర్శి ప్రియాంక, డైరెక్టర్ జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

సామాజిక సేవకుడు నక్క శ్రీనివాస్‌యాదవ్



హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాలు

హయత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని సామాజిక సేవకుడు నక్క శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఏకో బజార్‌ను ఆయన కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశుసంపదను పెంచి సేంద్రీయ ఎరువుల ద్వారా పంటలను పండించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. ప్రతి ఒక్కరు కొర్రలు, సద్దలు, రాగులు, జొన్నలు, ఊదలు తినడం నేర్చుకోవాలని కోరారు. వాటి వల్ల మనిషికి ఆరోగ్యం పెరుగుతుందన్నారు. గోధుమలను పండించి వాటిని శుద్ధి చేసుకుని తినాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు మాట్లాడుతూ మానవుడు సహజ వనరులను నాశనం చేస్తున్నాడని విచారం వ్యక్తం చేశారు. వీటిని కాపాడే బాధ్యత యువత తీసుకోవాలని కోరారు. వృక్ష సంపద ఉత్పత్తులను వినియోగించడం వల్ల అనేక సమస్యల నుంచి విముక్తి పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రజలకు ఇవ్వగలిగే పెద్ద ఆస్తి స్వచ్ఛమైన ప్రకృతి అని, స్వదేశీ క్రాకర్స్‌ను కాల్చి స్వదేశీ దీపావళి జరుపుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ పిండి వంటకాలు, మిల్లెట్ల జ్యూస్, చేనే త ఉత్పత్తులు, పుస్తకాల ప్రదర్శన, మట్టి ఉత్పత్తులు, జూట్ సంచులు, ఆవుపేడతో తయారు చేసిన ఉత్పత్తులు దాదాపు 25 రకాలతో ఏకో ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు.



పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, సైకిల్‌పై హెల్మెట్‌తో చిన్నారి

పిల్లలకూ ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి

టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి

కొత్తపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాచకొండ ట్రాఫిక్ శిక్షణ పార్కులో శుక్రవారం కంగారూ కిడ్స్ స్కూల్ చిన్నారులు ఉల్లాసంగా తిరుగుతూ సందడి చేశారు. పిల్లలకూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి తొలుత విద్యార్థులకు పార్కు గోడలపై గల రంగురంగుల సైనేజీ బోర్డులపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల సూచనలు, రోడ్ సైన్స్ చూపుతూ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు.పార్కులో ఏర్పాటు చేసిన నమూనా సిగ్నల్ వ్యవస్థనూ పిల్లలకు చూపించారు. లెక్చర్ హాల్‌లో యానిమేషన్ చిత్రాలు, రైమ్స్, నిబంధనలను పరిచయం చేసే వీడియో క్లిప్స్ ప్రదర్శించారు. హాల్‌లో చిన్నారిని సైకిల్‌పై కూర్చోబెట్టి సైకిల్ నడిపేవారు హెల్మెట్‌ను పెట్టుకోవాలన్నారు. బ్యాటరీ కారులో చిన్నారిని కూర్చోబెట్టి సీటు బెల్టు ఉపయోగాన్ని పిల్లలకు వివరించారు.

సైదాబాద్ తహసీల్దార్‌గా శ్రీదేవి



సైదాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మండల తహసీల్దార్‌గా (ఎఫ్‌ఓసీ) శ్రీదేవి బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ జయశ్రీ బదిలీపై రంగారెడ్డి జిల్లాకు వెళ్లారు. తను తాత్కాలికంగా బదిలీపై వచ్చానని, జూబ్లీహిల్స్ ఎన్నికల తరువాత మరొకరు వచ్చే అవకావం ఉందని నూతన తహసీల్దార్ తెలిపారు.



వైద్య శిబిరంలో ఆలయ కమిటీ సభ్యులు

విజయదుర్గామాతా ఆలయంలో వైద్య శిబిరం

సైదాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మాతా మైదానంలోని విజయదుర్గామాత ఆలయంలో శుక్రవారం కమిటీ ప్రతినిధి సంగీతారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది భక్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అల్లి శ్రవణ్, యాదగిరి గౌడ్, యాదయ్య, రవిందర్ గౌడ్, సంతోషి, కౌసల్య, నాగమణి, శ్రీలక్ష్మి, మధుమతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి



కర్మన్‌ఘాట్ సమావేశంలో మాట్లాడుతున్న కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్



బీసీ బంద్‌కు సహకరించాలని వ్యాపారస్తులను కోరుతున్న మన ఆలోచన సాధన సమితి సభ్యులు

చంపాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శనివారం బీసీ సంఘాలు నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌ను కుమ్మరులు తమ విధులను బహిష్కరించి బంద్‌లో పాల్గొనాలనిని కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపాదికన బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం నాయకులు జిల్లెల్ల శంకర్, ఎగిరిశెట్టి వీరయ్య, మల్కాజిగిరి సుభాష్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో..

మన్సూరాబాద్, (ఆంధ్రజ్యోతి): బంద్ ఫర్ జస్టిస్ పేరుతో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శనివారం చేపట్టే బీసీ బంద్‌ను సబ్బండ వర్గాల ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని మన ఆలోచన సాధన సమితి పిలుపునిచ్చింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు ఆదేశాల మేరకు సభ్యులు ఎల్బీనగర్‌లోని పాఠశాలలు, కళాశాలలు, వివిధ వాణిజ్య కేంద్రాలు, ఆర్టీసీ డిపోలు, కమర్షియ కాంప్లెక్సులు తదితర సంస్థల వద్ద శుక్రవారం ప్రజలను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డం నరసింహ, దొంత ఆనందం, పూస నరసింహబెస్త, నేవెళ్ల దేవేందర్, క్యాతూరి విద్యాసాగర్‌ముదిరాజ్, కోరంగి దుర్గారాణి, బచ్చనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గోద మల్లికార్జునగౌడ్, గునిగంటి చంద్రశేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు. బీసీ బంద్‌ను విజయవంతం చేద్దామని సోషల్ జస్టిస్ పార్టీ (ఎస్‌జేపీ) అధ్యక్షుడు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక సభ్యుడు చామకూర రాజు పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లోని ఎస్‌జేపీ కార్యాలయం నుంచి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలులో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని ఆయ ఆరోపించారు. తమ రిజర్వేషన్ హక్కును సాధించుకునేందుకు వివిధ పార్టీల్లోని బీసీ నాయకులు, ఏకమై బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

స్వచ్ఛందంగా పాల్గొనండి: మామిడి రామకృష్ణగౌడ్

ఎల్‌బీనగర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే బీసీ బంద్‌లో సకల జనులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని బీసీ రాష్ట్ర నాయకుడు, నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రామకృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. ఆర్కేపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను కల్పించడంలో అగ్రకులాల నాయకులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. బీసీ బంద్‌లో బీసీ మేధావులు, యువత, మహిళలు, వివిధ బీసీ కుల సంఘాలు, కులాలు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని రామకృష్ణగౌడ్ పిలుపునిచ్చారు.

నందిహిల్స్‌లో ఫుడ్ ఫెస్టివల్

సరూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌లో గల శ్రీవిద్యా హైస్కూల్‌లో దీపావళి సందర్భంగా శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ అందరినీ ఆకట్టుకుంది. వివిధ తరగతులకు చెందిన చిన్నారులు పొయ్యి (స్టవ్) పెట్టి పలు రకాల పిండి వంటలు, ఇతర ఆహార పదార్థాలు వండారు. అనంతరం వాటిని స్టాళ్లలో ప్రదర్శనకు పెట్టారు. నందిహిల్స్ కాలనీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే వంటకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.



ఫుడ్ ఫెస్టివల్‌లో చిన్నారులు ఏర్పాటు చేసిన స్టాళ్లు



కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

'సమాజాభివృద్ధికి దిక్సూచి సీనియర్ సిటిజన్లు'

మన్సూరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల అనుభవాలు, సూచనలు సమాజాభివృద్ధికి దిక్సూచి అని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ప్రగతినగర్‌కాలనీకి చెందిన ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం కార్పొరేటర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి నూతన కమిటీ సభ్యులను మిఠాయిలు పంచి అభినందించారు. కార్యక్రమంలో ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సీహెచ్ కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యక్షులు విశ్వేశ్వరరావు, రామచంద్రారెడ్డి, ట్రెజరర్ ఎ.సత్యనారాయణరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, సంయుక్తకార్యదర్శులు రాములు, సంజీవరెడ్డి, విష్ణుమూర్తి, రామేశ్వరీదేవి, ముఖ్యసలహాదారు సోమిరెడ్డి ఇతర సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

చంపాపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట యూనిట్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గంను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం గ్రేటర్ అధ్యక్షుడు టాగూరు ఇందర్‌సింగ్ తెలిపారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గోపిడి సుఖ్‌జీవన్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీకాంత్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా టి.నర్సింహాచార్యులు, ఫైనాన్స్ సెక్రటరీగా పి.మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్‌గా రామారావు, వాహిదా, జయింట్ సెక్రటరీగా రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యాదగిరిచారి, పబ్లిసిటీ సెక్రటరీగా లక్ష్మారెడ్డిలను ఎన్నుకున్నారు కార్యక్రమంలో ఎలక్షన్ ఆఫీసర్‌గా జిల్లా కోశాధికారి పి.రాంచంద్రారెడ్డి, అబ్జర్వర్‌గా నాగపురి నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

టపాకాయల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్

చాదర్‌ఘాట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెలుగుల జిలుగుల దీపావళి పర్వదినం సందర్భంగా తాత్కాలికంగా టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ అన్నారు. నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు నిబంధనలను పాటిస్తూ తాత్కాలిక టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. పోలీసుల అనుమతి లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'బాణసంచా కాల్చేటప్పుడు అద్దాలు పెట్టుకోవాలి'

చాదర్‌ఘాట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాణ సంచా కాల్చేటప్పుడు కంటికి అద్దాలు వాడడం ఎంతో శ్రేయస్కరమని, ఎట్టి పరిస్థితుల్లోను నిర్లక్ష్యం చేయకుండా కచ్చితంగా కంటి అద్దాలు వాడాలని వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నళిని కాంతి తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని 15 ఏళ్ల లోపు బాల బాలికలకు ఉచిత కంటి చికిత్సపై శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని వాసన్ ఐ కేర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె వివరించారు. కార్యక్రమంలో ఉదిత్ అజ్మాని. నయని, ఖాలీద్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



హయత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని హయత్‌నగర్ పోలీసులు కనుగొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. దాదాపు 45 ఏళ్ల వయస్సుల వ్యక్తి హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చనిపోయి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. చనిపోయిన వ్యక్తి ముస్లీం అయి ఉంటాడని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకోవాలి

చాదర్‌ఘాట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ఇద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శాలివాహననగర్ వాంబే కాలనీ నివాసులైన బి.వెంకటేశ్, ఇ.మహేష్ మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన బర్త్ డే పార్టీ లో కేక్ కట్ చేస్తున్న ఫొటోను స్టేటస్ నుంచి అప్‌లోడ్ చేసుకుని పలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ అసభ్యకరమైన పదజాలంతో వాయిస్ రికార్డు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఇందుకు కారకులైన ఒక మహిళ, మరో వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుపై తాము విచారణ జరుపుతున్నామని, పరిశీలించి బాధితులకు తగిన న్యాయం చేయడంతో పాటు అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ తెలిపారు.

పార్కు స్థలంలో షెడ్డు నిర్మించిన వారిపై ఫిర్యాదు

హయత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని లక్ష్మీమెగా టౌన్‌లోని నేతాజీ పార్కు స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మించారని కాలనీకి చెందిన జీఆర్ కరుణాకర్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పార్కు కోసం కేటాయించిన స్థలంలో షెడ్డు ఎలా కడతారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



హయత్‌నగర్ పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

సీపీఆర్.. తెలుసుకోండి

హయత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుకు గురైన వ్యక్తులకు సీపీఆర్ చేయడం ద్వారా తిరిగి బతికే అవకాశం ఎక్కువగా ఉందని తెలియజేస్తూ శుక్రవారం గ్రీన్ హెల్త్ 108 సిబ్బంది శుక్రవారం హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సాధారణ ప్రజలకు కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఈఎంఈ రాజబాబు, హయత్‌నగర్ ఈఎంటీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.



కుర్మల్‌గూడలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

చెత్తను తొలగిస్తున్నాం: బడంగ్‌పేట్ ఎస్సై

సరూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద వేస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్టు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి తెలిపారు. ఇక్కడి చెత్త వల్ల తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం స్థానికులు సదరు కేంద్రం వద్ద ధర్నా చేసి చెత్త వాహనాలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. దాంతో శుక్రవారం కమిషనర్ ఆదేశాల మేరకు యాదగిరి తన సిబ్బందితో అక్కడకు చేరుకుని భారీ వాహనాల్లో చెత్తను అక్కడి నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించారు. గతంలోనూ తాము ఇక్కడి కేంద్రంలో వినియోగించగా మిగిలిపోయిన చెత్తను రెగ్యులర్‌గా తరలించామని ఎస్సై చెప్పారు. ఇక ముందు కూడా స్థానికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.